సన్యాసి - by విరించి

అనగనగా ఒక ఊరు. ఆ ఊళ్ళో ఒక గుడి. ఆ గుళ్ళో ఒక దేవుడు, ఒక పూజారి, ఒక సన్యాసి, ఒక పనివాడు. వీళ్ళందరితో పాటు ఆ గుడికో ధర్మకర్త. ఆయనే ఆ ఊళ్ళో పెద్ద కూడా.

అలాంటి పెద్దాయనకి ఒక పనికిమాలిన (ఆయన ఉద్దేశంలో) కొడుకు. కొడుక్కి ఏదో ఒక మంచి ఉద్యోగం రావాలని ఆయన రోజూ గుళ్ళో దేవుడికి మొక్కుతూనే ఉన్నా, ఇప్పటిదాకా ఫలితం లేదు.

"అత్త కొట్టినందుకు కాదు, తోటికోడలు నవ్వినందుకు" అన్నట్టు ఆయన కొడుకు ఖాళీగా ఉండడం కంటే ఊళ్ళో వాళ్ళు అదే విషయాన్ని రోజూ అడగడంతో బాధ ఎక్కువైంది. ఇలాంటి బాధతోనే ఒక రోజు సాయంత్రం ఇంటికి రాగానే, తనకేమీ పట్టనట్టు అడ్డంగా పడుకుని T.V చూస్తున్న కొడుకు కనిపించాడు. దానితో అప్పటిదాకా ఉన్న చిరాకు ఒక్కసారి బయటికి తన్నుకొచ్చింది.

ఈ రోజు అటో ఇటో ఎటో తేలిపోవాలని నిర్ణయించుకుని ఆయన కొడుకుతో గొడవ పడ్డాడు.

దానికి భార్య అడ్డుపడి "వీడేమైనా ఆ గుళ్ళో ఉన్న సన్యాసి అనుకున్నారా ? ఎప్పటికీ ఏదీ చేయకుండా ఉండిపోవడానికి? ప్రయత్నిస్తున్నాడుగా" అనడంతో ఆయన ఆలోచనలు కొడుకుని వదిలి గుళ్ళో ఉన్న సన్యాసి వెంట పడ్డాయి.

"తన కొడుక్కి ఊరి మొత్తం మీద సన్యాసి అంటేనే గురి. ముందు సన్యాసిని వెళ్ళగొడితే అప్పుడు వీడు బాగుపడతాడు" అని అనుకున్నాడు.

గుళ్ళో ప్రతివాడు ఏదోక పని చేస్తాడు. పూజారి రోజూ ఉదయం 5 గంటలకే తాళాలు తీసి, గర్భగుడి అంతా శుభ్రం చేసి, అభిషేకం గట్రా చేస్తాడు. పనివాడు పూలు తేవడం, గుడి చుట్టు శుభ్రం చేయడం లాంటివి చేస్తుంటాడు. ఆఖరికి దేవుడు కూడా బిజీనే, భక్తుల కోరికలు వినడం, తీర్చడంతో. మరి మిగిలిన ఆ సన్యాసి మాత్రం రోజుకి రెండు పూటలా ప్రసాదం తో పాటూ, భక్తులు పెట్టేవి కూడా తేరగా తింటూ, రోజులో ఎక్కువ భాగం కళ్ళు మూసుకునే ఉంటాడు.

"ఇలా కూర్చుని నిద్రపోయే వాడిని గుళ్ళో ఎందుకు ఉండనివ్వాలి ? అలాంటి వాడిని చూసి ఊళ్ళో జనాలు బద్దకస్తులుగా తయారయ్యే ప్రమాదం ఉంది. ఇలాంటి వాళ్ళని వెళ్ళగొట్టాలి" అనుకుని గుడికి వెళ్ళి ఎవరో ఇచ్చిన అరటిపండు తినబోతున్న సన్యాసి నోట్లోంచి అది లాక్కుని "ఇవాల్టి నుంచి నువ్విక్కడ ఉండడానికి వీల్లేదు. పో బయటికి" అని అరిచాడు.

పూజారిని పిలిచి "ఇప్పటి నుంచి వీడికి ప్రసాదం పెట్టద్దు. తేరగా వస్తుంటే తిని కూర్చునే వాళ్ళంటే నాకు అసహ్యం" అని చెప్తుంటే గుళ్ళో జనాలు అంతా చుట్టూ పోగయ్యారు.

పూజారి ఏం చెప్పాలో అర్ధం కాక దిక్కులు చూస్తుంటే సన్యాసి మాత్రం అలాగే కూర్చుని నవ్వుతూ " నేను పని చేయట్లేదనే కదా నీ బాధ ?" అని అడిగాడు.

"అవును. నువ్వు పని చేసుకుని నీ సంపాదనతో తిను. ఇలా ఎన్నాళ్ళు ఖాళీ గా కూర్చుంటావ్?"

"ఇలా కూర్చోవడం ఏమైనా సులువు అనుకున్నావా ? ఏ ఆలోచన లేకుండా బుర్రని ఖాళీ గా ఉంచి, మనసుని ఏకాగ్రతతో ఒక చోట నిలిపి ఉంచడం చాలా కష్టం"

"తిని కూర్చోడం కూడా కష్టమేనా ? ఇదెవ్వడైనా చేయగలడు"

"సరే నువ్వు ప్రయత్నించి చూడు. నీ వల్ల అయితే చెప్పు, నేను కూడా అప్పుడు నీలాగే ఏదైనా పని చేస్తాను. నీ కొడుకుని కూడా దారిలో పెట్టే బాధ్యత నాదే. ఏమంటావ్ మరి?"

కొడుకుని మార్చడానికి ఇంతకంటే మంచి దారి లేదనిపించింది ఆయనకి. ఒక్కదెబ్బకు రెండు జీవితాలు దారిలో పడతాయి అనుకున్నాడు.

ఆయన "సరే" అనడంతో సన్యాసి ఆయనకి 3 రోజుల గడువు ఇచ్చాడు.

మొదటి రోజు పని ఏదీ చేయకుండా హాయిగా తిని పడుకోవడం బానే ఉన్నా, మనసులో ఆలోచనలు మాత్రం ఆగట్లేదు. రెండో రోజు నిద్ర కూడా పట్టలేదు. "అసలు ఏ ఆలోచనా లేకుండా మనిషి ఉండగలడా?" అని ఆలోచిస్తే "లేదు" అనే అనిపించింది.

మూడో రోజు భరించలేకపోయాడు. కానీ "నిజం" తెలిసింది.

వెంటనే గుడికి వెళ్ళి చూస్తే చిద్విలాసంగా నవ్వుతూ సన్యాసి కనిపించాడు.

తను తెలుసుకున్న "నిజాన్ని" ఎప్పుడో చూసిన ఆయన మొహం తేజస్సుతో వెలిగిపోతోంది.

* * * End * * *

మీ సూచనలూ, సలహాలు రచయిత విరించి కి తెలియచేయండి.
మీ అభిప్రాయాలు రచ్చబండ లో తెలియచేయండి